సాక్షి ప్రకాశం

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024

I



సిక్సర్ విజయానికి అవకాశం ఇవ్వండి

మరొక్కసారి గెలిపించి సిక్సర్ విజయానికి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే బాలినేని కోరారు.

- IIలో..



నవరత్నాలతో సంక్షేమ కాంతులు

నవరత్నాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
42/27

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు

ఒంగోలు అర్బన్: జిల్లాకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన అరవింద్ కుమార్ చౌరాసియా, ఇప్పటికే జిల్లాకు వచ్చిన గిద్దలూరు, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు మయూర్ కె మెహతా గురువారం ప్రకాశం భవనంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. చౌరాసియా ఒంగోలు, కొండపి, దర్శి, మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలులోని ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలుంటే సంప్రదించవచ్చు లేదా 92810 34505 నంబర్‌కు ఫోన్ కూడా చేసి తెలపవచ్చన్నారు.

ప్రవేశ పరీక్షలు ప్రశాంతం




ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న డీఈవో

ఒంగోలు: జిల్లాలో గురువారం రెండు రకాల ప్రవేశ పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 530 మంది హాజరుకావాల్సి ఉండగా 429 మంది హాజరయ్యారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 149 మందికిగాను 87 మంది, 7వ తరగతిలో ప్రవేశాలకు 89 మందికిగాను 59 మంది, 8వ తరగతిలో ప్రవేశాలకు 110 మందికిగాను 70 మంది హాజరయ్యారు. డీఈవో డి.సుభద్ర స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల, సెయింట్ జేవియర్స్, గురుదత్తా పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు. మొత్తం 878 మందికి 645 మంది హాజరయ్యారని, 233 మంది గైర్హాజరయ్యారు.

రెసిడెన్షియల్ కాలేజీల ప్రవేశ పరీక్షకు 95 మంది హాజరు:

ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు జరిగిన ప్రవేశ పరీక్షకు 2809 మందికిగాను 2398 మంది హాజరయ్యారు. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు 114 మందికిగాను 95 మంది, జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు 2809 మందికిగాను 2398 మంది హాజరయ్యారు.



చంద్రబాబు పేటెంట్లు పగ.. దగా..



పచ్చ పార్టీకి గంపగుత్తగా ఓట్లు సంపాదించి పెట్టేందుకు రాజ గురువు రామోజీ పత్రిక పసి పిల్లలను సైతం నిస్సిగ్గుగా వాడుకుటోంది. నిత్యం అసత్య కథనాలతో సీఎం వైఎస్ జగన్ సర్కారుపై విషం చిమ్ముతున్న ఎల్లో పత్రిక 'ఈనాడు' తాజాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై అడ్డగోలు రాతలతో రెచ్చిపోయింది. వాస్తవాలను విస్మరించి అసత్యాలు వండివార్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీతం కోసం రోడ్డెక్కిన కార్యకర్తలను గుర్రాలతో తొక్కించి, లాఠీలతో కొట్టించిన చంద్రబాబును వదిలేసి అడగకుండానే వేతనాలు పెంచిన సీఎం వైఎస్ జగన్‌పై నిందలు మోపింది. బాబు జమానాలో పరాయి పంచన కునారిల్లిన రోజులను మరిచి.. నాడు–నేడుతో అంగన్‌వాడీ కేంద్రాల దశ దిశ మార్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కింది.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2,903
గర్భిణులు, బాలింతలు	50,499
6 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు	71,875
3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు	57,794
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూతనంగా మంజూరైన అంగన్‌వాడీలు	82
శ్లాబ్ వరకు పూర్తయినవి	60
రూఫ్ లెవెల్‌లో ఉన్నవి	22

టీడీపీ జమానాలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రహణం

- ఆనాడు బాబు తాబేదార్లే ఐసీడీఎస్ కాంట్రాక్టర్లు
- యథేచ్ఛగా ముక్కిపోయిన బియ్యం, మురిగిపోయిన గుడ్లు సరఫరా
- ప్రశ్నించిన అంగన్‌వాడీలకు వేధింపుల సమాధానం
- జీతం కోసం రోడ్డెక్కితే గుర్రాలతో తొక్కించిన వైనం
- ఎన్నికల వేళ ప్రజలను తప్పుదోవ పట్టించేలా గురివింద రాతలు



సంతనూతలపాడు మండలం మద్దులూరులో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీల రూపురేఖలు మారిపోయాయి. మెరుగైన వసతులు కల్పించడంతోపాటు చిన్నారుల దగ్గర నుంచి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తోంది. అంతే కాకుండా ఈ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే వర్కర్లు, హెల్పర్లు వేతనం సరిపోక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారు అడగకపోయినా సీఎం కాగానే 2019 జూన్ 26న వేతనం పెంచుతూ జీఓ జారీ చేశారు. అంగన్‌వాడీల కార్యకర్తల వేతనాన్ని రూ.7 వేల నుంచి రూ.11500కు, ఆయాల వేతనం రూ.4,500 నుంచి రూ.7 వేలకు పెంచారు. వయో పరిమితి పెంచడంతోపాటు అర్హులైన కార్యకర్తలకు గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించారు. పాత స్మార్ట్ ఫోన్ల స్థానంలో కొత్తవి అందజేశారు. మునుపెన్నడూ లేని విధంగా 20 వార్షిక సెలవులు, 180 రోజుల ప్రసూతి సెలవు మంజూరు చేశారు. బీమా సౌకర్యం కల్పించారు. ప్రతి నెలా విధి నిర్వహణలో మెరుగైన పనితీరు కనబరిచిన కార్యకర్తలు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా రూ.500 అందించే కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. వర్కర్లు, హెల్పర్లకు ఒకొక్కరికి 6 చొప్పున యూనిఫాం చీరలు పంపిణీ చేశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య బోధించేందుకు కేంద్రాల్లో వసతులు మెరుగుపరచడంతోపాటు స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాల నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతలు సచివాలయ మహిళా పోలీసులకు ప్రభుత్వం అప్పగించింది.

వేతనం నిలిచిందెక్కడ చెప్మా..?

అంగన్‌వాడీ సిబ్బందికి వేతనం ఆగిన సందర్భం గడిచిన 58 నెలల్లో ఒక్కటి మాత్రమే. అదికూడా అంగన్‌వాడీ యూనియన్ నాయకుల్లో కొందరిని చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం ఉసిగొల్పి సమ్మె చేయించిన 2023 డిసెంబర్, 2024 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తాత్కాలికంగా వేతనం నిలిపారు. ఎవరైనా విధులకు హాజరుకాకపోతే వేతనం ఆపడం సహజం. అంగన్‌వాడీ యూనియన్లతో చర్చలు జరిపిన రాష్ట్ర ప్రభుత్వం వారి 11 డిమాండ్లలో పదింటిని వెంటనే అమలు చేసింది. 2024 జూలైలో వేతనం పెంచుతామని హామీ ఇవ్వడంతో అంగన్‌వాడీలు సమ్మె విరమించి విధుల్లో చేరారు. సమ్మె కాలానికి సంబంధించి వేతనం అందజేయాలని అంగన్‌వాడీలు చేసిన విజ్ఞప్తిపై సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్ద మనసుతో స్పందించి ఇటీవల నగదు అందజేసింది. కూరగాయలు, గ్యాస్ బిల్లులు 2023 నవంబర్ మాసం వరకు చెల్లించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఖరారు కాకపోవడంతో నవంబర్ నుంచి బిల్లులు నిలిచాయి. ఇదిలా ఉండగా అంగన్‌వాడీల సమ్మె కాలంలో సైతం లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా సచివాలయ ఉద్యోగులతో పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

అందరి ఆమోదంతోనే విలీనం

జాతీయ విద్యా విధానం అమలు చేసేందుకు సమ్మతం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం తదనుగుణంగా చర్యలు చేపట్టింది. లబ్ధిదారులకు అనుకూలంగా ఉన్న చోట, ఎలాంటి అభ్యంతరాలు లేని చోట మాత్రమే కేంద్రాలను విలీనం చేసింది. మిగిలిన కేంద్రాలన్నీ యథావిధిగా ఎక్కడివక్కడే నిర్వహిస్తున్నారు. ఎక్కడా ఇబ్బంది లేకపోయినా అబద్ధాలు అచ్చు వేయడం ద్వారా ఎల్లో పత్రిక తన నైజాన్ని చాటుకుంది.

గతం కంటే మిన్నగా పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని మొదటగా గోడౌన్ స్టాక్ పాయింట్‌లో సంబంధిత సీడీపీఓలు పరిశీలిస్తారు. నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేసిన తర్వాత ప్రత్యేక ×యాప్‌×లో నమోదు చేస్తారు. ఆ తర్వాతే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారు. నాణ్యత లేనివాటిని గుర్తిస్తే గోడౌన్ వద్దే సీడీపీఓలు తిరస్కరిస్తారు. కోడిడిగుడ్లను 4 విడతలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఏడాదిపాటు నెలకు 25 కోడిగుడ్లు అందిస్తారు. తగిన పరిమాణంతో ఉన్న గుడ్లతో పాటు నెలకు 3 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, అర కేజీ నూనె, 2 కేజీల రాగి పిండి, 1 కేజీ అటుకులు, పావు కేజీ ఎండు కర్జూరం, అర కేజీ వేరు శనగ పప్పు చెక్క(చిక్కీలు), పావు కేజీ బెల్లం, 5 లీటర్ల పాలు, బాలామృతం అందజేస్తున్నారు. టీడీపీ జమానాలో ఇస్తున్న సోర్టెక్స్ బియ్యాన్ని పక్కనబెట్టి ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12తో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందించేందుకు సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో మెరుగైన పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నారు. టీడీపీ జమానాలో ముక్కిపోయిన కందిపప్పు, కోడి గుడ్లు ఇచ్చి సరిపెట్టినా ఎల్లో పత్రికకు అదే బ్రహ్మాండం. చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం మెరుగైన పౌష్టికాహారం ఇవ్వడంతోపాటు వైద్యులు, ఏఎన్ఎంలతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయడంతోపాటు విటమిన్ ఏ ద్రావణం, ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తూ చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషిచేస్తున్నా పచ్చ పత్రిక అక్కసు వెళ్లగక్కడంపై లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ పాలనలో అమ్మ లాలనలా అంగన్‌వాడీ కేంద్రాలు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బాబు కంటే మిన్నగా పౌష్టికాహారం

వైఎస్ జగన్ సీఎం కాగానే వేతనం, అలవెన్సులు పెంపు

అంగన్‌వాడీల కార్యకర్తల జీతం రూ.7 వేల నుంచి రూ.11,500కు..

ఆయాల వేతనం రూ.4,500 నుంచి రూ.7 వేలు చేస్తూ నిర్ణయం

ఈనాడు అసత్య కథనాన్ని ఖండిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ విషయమై ఈనాడు పత్రికలో ప్రచురించిన 'పసివారిపైనా పాలకుడి పడగ' కథనం పూర్తిగా అవాస్తవం. తప్పుడు రాతలను ఖండిస్తున్నాం. నాణ్యత లేని కిట్లు, మురిగిపోయిన కోడిగుడ్లు ఇస్తున్నారని రాయడం సరికాదు. గోడౌన్‌లోనే సీడీపీఓలు పరిశీలన చేసిన తర్వాతే ఆ పరిస్థితిని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాతే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారు. నాణ్యత లేకపోతే గోడౌన్‌లోనే తిరస్కరిస్తాం. ఇక విలీనానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి అభ్యంతరాలు లేకపోతేనే చేస్తున్నాం. అభ్యంతరాలు ఉంటే విలీనం చేసే ప్రసక్తే లేదు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం కూడా అందజేస్తోంది.

– మాధురి, ఐసీడీఎస్ పీడీ



అన్నీ సక్రమంగా ఇస్తున్నారు:



నా కుమారుడు యామవరపు సాత్విక్ వీర వయసు ఏడాది. కొండపి అంగన్‌వాడీ సెంటర్–4లో పేరు నమోదై ఉంది. మా బాబు పుట్టిన ఆరు నెలల వరకు కంటికి రెప్పలా చూసుకున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టులో ప్రతి నెలా రెండు కేజీల రాగిపిండి, 25 కోడిగుడ్లు, అటుకులు, పావుకిలో బెల్లం, చిక్కీ, పావుకిలో ఎండు కర్జూరం, మూడు కేజీల బియ్యం, అరకిలో నూనె, కేజీ కందిపప్పు, ఐదులీటర్ల పాలు ఇచ్చారు. నా బిడ్డకు ఏడో నెల నుంచి నెలకు 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలామృతం రెండున్నర కేజీలు ఇస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చినవి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్త శాతం మెరుగుపడింది. నేను, నా బిడ్డ చాలా ఆరోగ్యంగా ఉన్నాం.

– యామవరపు పూజిత, కొండపి

దద్దరిల్లిన దద్దాల ర్యాలీ



గజమాలతో దద్దాలను సత్కరిస్తున్న అభిమానులు



నామినేషన్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన అభిమానగణం

- జన కోలాహలం మధ్య సాగిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ నామినేషన్
- హాజరైన బూచేపల్లి, జంకె, తూమాటి, చింతలచెరువు, కదిరి, బన్ని



దద్దాలతో వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరి రూరల్: కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో కనిగిరి పట్టణం జనసంద్రమైంది. వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ నామినేషన్ సందర్భంగా గురువారం నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా స్వచ్ఛందంగా తరలివచ్చారు. జై జగన్.. జై జై దద్దాల నారాయణ నినాదాలతో పట్టణమంతా దద్దరిల్లింది.

2.30 గంటల సేపు సాగిన ర్యాలీ:

జన కోలాహలం మధ్య దాదాపు 2.30 గంటల సేపు దద్దాల నామినేషన్ ర్యాలీ మహోత్సవం సాగింది. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి గం.10.35 కు ర్యాలీ ప్రారంభం కాగా.. మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక చర్చి సెంటర్‌కు చేరుకుంది. సుగుణావతమ్మ ఆస్పత్రి సెంటర్, నాజ్ సెంటర్, బొడ్డు చావిడి సెంటర్, కొట్ల బజార్, మున్సిపాలిటీ సెంటర్, ఒంగోలు బస్టాండ్, ఓవీ రోడ్డు మీదుగా.. స్థానిక పామూరు బస్టాండ్ చర్చి సెంటర్‌కు చేరుకుంది. పలు చోట్ల భారీ గజమాలతో స్వాగతం పలికారు. డప్పు, కోలాట నృత్యాలతో, తప్పెట్ల తాళాలతో.. బాణా సంచా మోతలతో పట్టణంలో ర్యాలీ కోలాహలంగా సాగింది. ర్యాలీలో అగ్ర భాగాన పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి, ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజు, దద్దాల మంజు భార్గవి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి, గాయం సావిత్రి, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు. ర్యాలీ అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లి నామినేషన్‌లను దాఖలు చేశారు. పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, ఆయన సతీమణి దద్దాల మంజు భార్గవిలు చెరొక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

కనిగిరిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తున్నాం:

జగనన్న ఆశీస్సులతో, ప్రజాదీవెనలతో కనిగిరి కొండపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవుని దయతో, బాలినేని వాసన్న దీవెనలతో తాను వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి మండుటెండను సైతం లెక్కచేయకుండా స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కనిగిరి గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా:

కనిగిరి నియోజకవర్గం అంటేనే వైఎస్సార్ సీపీ అడ్డా.. అని ఈ రోజు దద్దాల నారాయణ నామినేషన్‌కు తరలి వచ్చిన అశేష జనవాహినే అందుకు నిదర్శనం అని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి సీటును కైవసం చేసుకోడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎస్‌కే బుజ్జి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, చింతం శ్రీనివాసుల యాదవ్, సింగిల్ విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, తమ్మినేని సుజాత, మద్దిబోయిన విద్యా యాదవ్ పాల్గొన్నారు.

అసెంబ్లీలకు 354 నామినేషన్లు



ఒంగోలు పార్లమెంట్ స్థానానికి చెవిరెడ్డి లక్ష్మి తరఫున రెండో సెట్ నామినేషన్ పత్రాలు కలెక్టర్‌కు దాఖలు చేస్తున్న వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కనిగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్

- ముగిసిన నామినేషన్‌ల స్వీకరణ
- నేడు పరిశీలన.. 29వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు
- కనిగిరి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా దద్దాల నారాయణ యాదవ్ నామినేషన్
- మార్కాపురం టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి నామినేషన్

సాక్షిప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అధికార వైఎస్సార్ సీపీతో పాటు కూటమికి చెందిన టీడీపీ అభ్యర్థులు, ఇతర పార్టీలకు చెందిన వారు, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఈ నెల 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా ఎన్నికల కమిషన్ విధించింది. నామినేషన్‌ల స్వీకరణ చివరి రోజు గురువారం మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మరో నామినేషన్‌ను దాఖలు చేశారు. ఇప్పటికే రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేసిన ఆయన మరో నామినేషన్ కూడా వేశారు. అధికార వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థిగా దద్దాల నారాయణ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. భారీ ఊరేగింపుగా వెళ్లి దద్దాల నారాయణ కనిగిరి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి కూడా తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి తరఫున మూడు, నాలుగో సెట్ నామినేషన్‌లను మల్లెల భాస్కర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి దాఖలు చేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి సతీమణి లక్ష్మి తరఫున రెండో సెట్ నామినేషన్ పత్రాలను వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి కలెక్టర్‌కు సమర్పించారు. ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థిగా మాగుంట తరఫున మరో నామినేషన్ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్లో జోష్...

అధికార వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ వేసిన అభ్యర్థుల్లో జోష్ కనిపిస్తోంది. మొదటి రోజు నుంచి చివరి రోజు 25వ తేదీ కూడా అధికార వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్లు వేస్తూనే ఉన్నారు. జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్‌కు వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రతి నామినేషన్‌లోనూ పాల్గొన్నారు. ఆయన అత్యంత నిరాడంబరంగా నామినేషన్ వేశారు. ఇక ఒంగోలులో బాలినేని శ్రీనివాస రెడ్డి వేసిన నామినేషన్ రోజు జన ప్రభంజనంతో ఒంగోలు ఉక్కిరిబిక్కిరి అయింది. అదేవిధంగా మిగతా కొండపిలో మంత్రి ఆదిమూలపు సురేష్, దర్శిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరులో ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, యర్రగొండపాలెం తాటిపర్తి చంద్రశేఖర్, కనిగిరిలో దద్దాల నారాయణ యాదవ్ నామినేషన్ల ర్యాలీలు సైతం భారీ స్థాయిలో జరిగాయి. జిల్లాలోని బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి అధికార వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ వేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

ముగిసిన స్వీకరణ

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ వ్యవహరించారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఆర్‌డీఓ సుబ్బారెడ్డి వ్యవహరించారు. అదేవిధంగా జిల్లాలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా రిటర్నింగ్ అధికారుల వద్ద ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు.

18 నుంచి 25వ తేదీ వరకు రిటర్నింగ్ అధికారులకు అందజేసిన నామినేషన్లు ఇలా..

ఒంగోలు పార్లమెంట్‌కు 61 నామినేషన్లు

అసెంబ్లీ	అభ్యర్థులు	నామినేషన్ల సంఖ్య
ఒంగోలు	36	61
కనిగిరి	27	39
యర్రగొండపాలెం	23	43
గిద్దలూరు	31	42
దర్శి	22	43
మార్కాపురం	31	44
కొండపి	25	47
సంతనూతలపాడు (బాపట్ల పార్లమెంట్)	17	35
మొత్తం	212	354

ప్రజల్లో ధైర్యం నింపాలి

● కేంద్ర సాయుధ బలగాల అధికారులతో ఎస్పీ సుమిత్ సునీల్ సమీక్ష


సాయుధ బలగాల అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, ఏఎస్పీ

ఒంగోలు సబర్బన్: ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశించారు. కేంద్ర సాయుధ బలగాల అధికారులతో గురువారం తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు సజావుగా, సాఫీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల సందర్భంగా జిల్లాకు కేటాయించిన కేంద్ర సాయుధ దళాలు సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, తమిళనాడు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధుల గురించి పోలీస్‌స్టేషన్, చెక్‌పోస్టులు, స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల వివరాలు, జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఇతర విషయాల గురించి వారికి దిశానిర్దేశం చేశారు. ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలను అనుసరిస్తూ సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ధైర్యాన్ని నింపాలన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, ఏరియా డామినేషన్, వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. లోకల్ పోలీస్ అధికారులతో సమన్వయంగా ఉంటూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలకు తావులేకుండా చూడాలన్నారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పహారా కాయాలన్నారు. ఎన్నికల సామగ్రి పోలింగ్ కేంద్రాలకు రవాణా చేసే సమయంలోనూ పోలింగ్ ప్రక్రియ ముగిశాక ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లలోకి చేర్చి భద్రపరిచే సమయంలోనూ ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద, స్ట్రాంగ్ రూముల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉండాలని, అలా లేకుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమీక్షలో ఏఎస్పీ(అడ్మిన్)కే.నాగేశ్వర రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, కేంద్ర సాయుధ బలగాల అధికారులు కూడా పాల్గొన్నారు.

వలంటీర్ నర్సరీ ధ్వంసం


నర్సరీలో ధ్వంసం చేసిన షేడ్‌నెట్

అర్థవీడు(బేస్తవారిపేట): మండలంలోని యాచవరానికి చెందిన వలంటీర్ తంగెళ్ల ఖాశీం దేవుని మాన్యం పొలం కౌలుకు తీసుకుని నర్సరీ పెట్టుకున్నాడు. టమోట, మిరప, సన్నారీ నారు పెంచుతున్నాడు. ఈ మధ్య కాలంలో టీడీపీ నాయకులు పార్టీలో చేరాలని ఒత్తిడి చేశారు. అయితే తాను వైఎస్సార్ సీపీలో కొనసాగుతానని, పార్టీ మారనని టీడీపీ నాయకులకు చెప్పాడు. దీంతో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నర్సరీలోని డ్రిప్ పైపులు, షేడ్ నెట్స్, నారుపోసే ట్రేలు ధ్వంసం చేశారు. రూ.నాలుగు లక్షలు నష్టం జరిగిందని బాధితుడు ఖాశీం తెలిపాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

టీడీపీ అభ్యర్థి నామినేషన్‌లో కాంట్రాక్టు ఉద్యోగి


టీడిపి అభ్యర్థి నామినేషన్‌లో అనంతారెడ్డి (టోపి ఉన్న వ్యక్తి)

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు నవోదయ విద్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న బి. అనంతరెడ్డి గురువారం మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్‌లో పార్టీ టోపీ ధరించి హాజరుకావడం చర్చనీయాంశమైంది. ఒక కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తూ పార్టీ అభ్యర్థి నామినేషన్‌లో పాల్గొనడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిక్సర్ విజయానికి
అవకాశం ఇవ్వండి


6వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో బాలినేని శ్రీనివాసరెడ్డి


టీడీపీ నాయకుడు షేక్ సుభానిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలినేని

● ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మరొక్క సారి గెలిపించి సిక్సర్ విజయానికి అవకాశం ఇస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని 23, 24, 25 డివిజన్లలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారని కొనియాడారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. గత ఐదేళ్లలో ఒంగోలును ఎంతో అభివృద్ధి చేశానన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా 25 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా 4 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చేందుకు అవకాశం ఉందని, ఎన్నికల తర్వాత తప్పక ఇస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వందల కోట్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జగనన్న పేదల పాలిటి పెన్నిధిగా ఎన్నికలలో ఒక్కడే పోరాడుతుంటే ప్రతిపక్షాలు పొత్తులతో పోటీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు అలివిమాలిన హామీలు ఇస్తున్నారని, వారి మాయ మాటలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. తొలుత రంగారాయుడు చెరువు దగ్గర నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలేరమ్మ గుడి మీదుగా బండ్లమిట్ట సెంటర్, అద్దంకి బస్టాండ్ మీదుగా కోటవీధి గుండా సాగింది. పార్టీ నాయకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి అడుగడుగునా పూలవర్షం కురిపించారు. కార్యక్రమంలో నగరపార్టీ అధ్యక్షుడు కఠారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, గొర్రెపాటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ, షేక్ ఇంతజార్, ఏఎంసీ చైర్మన్ కఠారి రామచంద్రరావు, డివిజన్ అధ్యక్షుడు పట్నం మధుసూదన్, తుల్లి కవిశివ, గంట అంజి, తిరుపతి, చలం, డివిజన్ ఇన్‌చార్జి దాసరి నారాయణ, డివిజన్ ఇన్‌చార్జి బాలిశెట్టి నాగేశ్వరరావు, తిప్పరం మల్లి, 24వ డివిజన్ అధ్యక్షుడు తోట సత్యం, జిల్లా అధికార ప్రతినిధి కావటి రవికుమార్, 23వ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేదారి లలిత, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ రమాదేవి, బడుగు ఇందిర, బొట్ల సుబ్బారావు, బాకా బ్రదర్స్ శివారెడ్డి, రమేష్‌రెడ్డి, షేక ఆరిఫ్, జుబేర్, అన్వర్, ఆసిఫ్, కలాం తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక..
23వ డివిజన్‌లో బాలినేని ప్రచారం సందర్భంగా 3వ డివిజన్ బలరాం కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు షేక్ సుభానితో పాటు 10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కండువాలు కప్పి బాలినేని పార్టీలోకి ఆహ్వానించారు.

గరుత్మంతుడి సాక్షిగా..
రఘునాయకస్వామి కల్యాణం..

● కల్యాణాన్ని తిలకించి పులకించిన భక్తజనం
● స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మేరుగు


ప్రత్యేక అలంకరణలో రఘునాయక స్వామి

నాగులుప్పలపాడు: భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నారాయణుడి ఆశీస్సులు మోసుకొచ్చి స్వామిపై ప్రదక్షిణలు చేసిన గరుత్మంతుడి రాకతో రఘునాయక స్వామి కల్యాణం కనులపండువగా సాగింది. మండలంలోని చదలవాడ రఘునాయక స్వామి వార్షిక వేడుకల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి కళ్యాణ ఘట్టంలో అత్యంత ముఖ్యమైందిగా భావించే గరుడ పక్షి రాకకోసం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఎదురుచూశారు. నారాయణ నామ స్మరణతో కళ్యాణ ఘట్టం మార్మోగుతున్న సమయంలో భక్తుల నమ్మకం నిజం చేసేలా ఉదయం 11.30 గంటలకు గరుడ పక్షులు కల్యాణ మండపంపై మూడు ప్రదక్షిణలు చేయడంతో రఘునాయక స్వామి కల్యాణ ఘట్టాన్ని పండితులు పూర్తి చేశారు. కల్యాణ వేడుకకు స్వామికి ఆనవాయితీగా అందించే పట్టు వస్త్రాలను పెనుబోతు కుటుంబం వారి తరుపున సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పట్టు వస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం గ్రామంలో నిర్వహించిన స్వామి రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజల్లో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, మండల పార్టీ కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, చదలవాడ గ్రామ సర్పంచ్ దాసరి వరప్రసాద్, పోలినేని కోటేశ్వరరావు, తోకల శ్రీను, అశోక్, రాంబాబు, పాద పవన్ తదితరులు ఉన్నారు.




కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు ఆకాశంలో విహరిస్తున్న గరుడపక్షి (ఇన్‌సెట్‌లో) గరుడపక్షిని వీక్షిస్తున్న భక్తులు

కిక్కుకు సై.. ఓటుకు నై!

● టీడీపీ అభ్యర్థి నామినేషన్‌లో విచ్చలవిడిగా మద్యం పంపిణీ
● బార్ల వద్ద క్యూకట్టిన అద్దె జనం
● కార్యక్రమం మధ్యలోనే జారుకున్న వైనం


మద్యం దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు


నామినేషన్ కార్యక్రమానికి వచ్చి లిక్కర్ తాగుతున్న టీడీపీ కార్యకర్తలు

మార్కాపురంటౌన్/మార్కాపురం రూరల్: మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి నామినేషన్ లో తెలంగాణ మద్యం ఏరులై పారింది. ఈనెల 22న మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు నామినేషన్ ర్యాలీ సూపర్ సక్సెస్ అయిన సంగతి తెలిసిందే. దీంతో దిగులు చెందిన కందుల నారాయణ రెడ్డి.. నామినేషన్‌కు వస్తే మహిళలకు 300 డబ్బులు, బిరియానీ ప్యాకెట్లు, పురుషులకైతే అదనంగా లిక్కర్ బాటిల్స్ ఇవ్వడంతో వారంతా మార్కాపురం చేరుకున్నారు. అయితే ర్యాలీ ప్రారంభం అయిన తర్వాత మధ్యలోనే అద్దెకు తెచ్చుకున్న కార్యకర్తలు మహిళలు, పురుషులు ఇంటిబాట పట్టారు. పట్టణంలోని పలుచోట్ల రహస్యంగా లిక్కర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్నారనే సమాచారాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెప్పినా వారు ఆ పార్టీ ముఖ్యనేతలకు సమాచారం అందించి తనిఖీలను మమ అనిపించారు. ఇక బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిగాయి. టీడీపీ కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమం కన్నా మందు బాటిళ్లు తెచ్చుకోవడానికే అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో నాయకులు తలలు పట్టుకున్నారు. ర్యాలీ ఆశించిన స్థాయిలో విజయవంతం కాకపోవడంతో ఆ పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత బస్టాండు వద్దకు వచ్చే సరికి జనాలు సంఖ్య పలుచగా ఉండటంతో టీడీపీ నేతలు ఆందోళన చెందారు. ఇదే సమయంలో మందెక్కువైన తెలుగు తమ్ముళ్లు కంభం సెంటరులో క్రేన్ ఏర్పాటు చేసి కందుల నారాయణరెడ్డి కోసం వేయాల్సిన దండలను పీకేశారు. ఆ పార్టీ నాయకులు ఈ సంఘటనకు నివ్వెరపోయారు. మొత్తం మీద అద్దె కార్యకర్తల వ్యవహారం బెడిసి కొట్టడంతో నాయకుల్లో నిరాశ, నిస్పృహలు అలముకున్నాయి.

టీడీపీ అభ్యర్థి నామినేషన్‌లో వీఆర్‌ఏ


నామినేషన్‌కు వెళుతున్న వీఆర్‌ఏ ప్రసాద్ (టిక్ పెట్టిన వ్యక్తి)

పొదిలి: తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కందుల నారాయణ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని జువ్వలేరు గ్రామం నుంచి కొంత మంది వెళ్లారు. అయితే వారిలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ప్రసాద్ కూడా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి, ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రసాద్ పాల్గొనడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సదరు వీఆర్‌ఏపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు


పీరాపురంలో సంక్షేమ కరపత్రం పంపిణీ చేస్తున్న మంత్రి సురేష్

జరుగుమల్లి: నవరత్నాలతో నిరు పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి వెలుగులు నింపారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల పరిధిలోని పీరాపురం, పచ్చవ, కామేపల్లి అగ్రహారం, చతుకుపాడులోని తూర్పు ఎస్సీ కాలనీ, జనార్దనపురం, రెడ్డిపాలెంలోని బీసీ కాలనీ, అగ్రహారం కాలనీలు, నర్సింగోలు గ్రామాల్లో పల్లె పల్లెకు సిద్ధం కార్యక్రమంలో భాగంగా మంత్రి సురేష్ సుడిగాలి పర్యటన చేశారు. కామేపల్లి పోలేరమ్మ దేవాలయంలో పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామేపల్లిలోని చింతల ఆదినారాయణ నివాసంలో నాయకులతో మాటామంతీ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ప్రజలు మంత్రి సురేష్‌కు అఖండ స్వాగతం పలికి, మంత్రి సురేష్‌పై పూల వర్షం కురిపించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలన్నీ ఇంటికే చేరుతున్నాయన్నారు. జగనన్నతోనే ప్రతి పేదవాడికీ న్యాయం జరుగుతుందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కల్పించిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి అని తెలిపారు. చిన్న చిన్న విభేదాలు పక్కన పెట్టి ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. అనంతరం పచ్చవ ఎస్సీ కాలనీలో షుగరు వ్యాధితో రెండు కాళ్ళు పోగొట్టుకొని మంచానికే పరిమితమైన కొండాబత్తిన చెన్నయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బత్తిన మనోహర్ మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, కొత్తపాలెం సర్పంచి బొట్లగుంట మాల్యాద్రి, పచ్చవ సర్పంచ్ కొండాబత్తిన కృష్ణయ్య, నర్సింగోలు సర్పంచి ఏజెర్ల ఇక్కయ్య, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, చాగంటి కొండయ్య, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి



ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నందిని

● మన ఊరికి మన శివన్న ఎన్నికల ప్రచారంలో డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి
● జమ్మలమడక, మక్కెనేనివారిపాలెంలో మండుటెండను లెక్కచేయని ప్రజలు

ముండ్లమూరు: పేదల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని జమ్మలమడక, మక్కెనేనివారిపాలెం గ్రామాల్లో గురువారం సతీమణి నందిని, కుమారుడు విద్యాధరరెడ్డితో కలిసి మన ఊరికి మన శివన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు మండెటెండను సైతం లెక్క చేయక వారి వెంట నడిచి బూచేపల్లి కుటుంబంపై అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి బూచేపల్లి కుటుంబంతో విడదీయరాని బంధం ఉందన్నారు. జమ్మలమడకకి నేను అల్లుడిని మాత్రమే కాదని, గ్రామ ప్రజలు నన్ను తమ్ముడిలా, అన్నలా, సొంత కుటుంబసభ్యుడిలా ఎప్పుడు వచ్చినా ఆదరించారన్నారు. మీ రుణం తీర్చుకునేందుకే జగనన్న మరలా నాకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినందున మరోసారి ఆదరించి గెలిపించాలని కోరారు. మహానేత వైఎస్సార్ పాదయాత్రతో రైతుల కష్టసుఖాలు తెలుసుకొని రైతు సంక్షేమమం కోసం రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ అమలు చేశారన్నారు. తండ్రి బాటలో జగనన్న పాదయాత్ర చేసి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకొని వారి అభివృద్ధి కోసం నవరత్నాలతో నాంది పలికి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో చంద్రబాబునాయుడికి ప్రజల కోసం తాను చేసిన ఒక్క మంచి పథకం గురించి చెప్పుకునే స్థితిలో లేరన్నారు. అమలు కానీ హామీలు ఇవ్వడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. మాయ మాటలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైన చంద్రబాబునాయుడు ఆయన కూటమికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపి నేరుగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ఖాతాల్లో జమ చేసిన ఘనత రాష్ట్ర చరిత్రలో జగనన్నకే దక్కిందన్నారు. దర్శి నియోజకవర్గానికి ఎన్నికల వేళ నాన్ లోకల్ నాయకులు వచ్చి వెళ్తుంటారని, మీ శివన్న మాత్రమే మీ కోసం 20 ఏళ్లుగా సేవ చేస్తున్నారని గుర్తుంచుకోవాలన్నారు. నియోజకవర్గంలో అందరిలో ఒకడిలా కార్యకర్తకు ఎలాంటి కష్టం వచ్చినా పిలిస్తే పలికే మీ శివన్నను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత సేవ చేస్తానన్నారు. ఎస్టీ కాలనీ వాసులకు ఇళ్లు ఏర్పాటు, పట్టాదారు పాసు పుస్తకాలు, శాశ్వత తాగునీరు అందించేందుకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. మక్కెనేనివారిపాలెం అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతానన్నారు. మండల ఇన్‌చార్జ్‌లు వెంకటరత్నం, కాపా నరసింహారెడ్డి, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు సుంకర రామిరెడ్డి, కోటిరెడ్డి, కాపా శ్రీనివాసరెడ్డి, అమర్నాథరెడ్డి, వాకా రమణారెడ్డి, దేవిరెడ్డి పోతిరెడ్డి, ముకల చెంచురామిరెడ్డి, సుంకర నారపరెడ్డి, జక్కం రమణారెడ్డి, అంచుల శ్రీనివాసరావు, నలమోలు హనుమంతరావు, కన్నెగంటి హనుమయ్య, పఠాన్ ఖాజావలి, సర్పంచ్ నలమోలు వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వైస్‌ఎంపీపీ బంకా రమణమ్మనాగిరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, గోపనబోయిన వెంకటేశ్వరరావు, గూడాల సుబ్బారెడ్డి, సోమేపల్లి సుబ్బయ్య, ఎనుముల శ్రీనివాసరెడ్డి, భిక్షాలురెడ్డి, యరబ్రోలు శ్రీనివాసరెడ్డి, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..తెప్పోత్సవం


నీటి గుండం వద్ద తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


నీటిగుండంలో శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి తెప్పోత్సవం


శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి

రాచర్ల: మండలంలోని జేపీచెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్లరంగనాయకస్వామి తెప్పోత్సవం కనులపండువగా సాగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి సమీపంలోని నీటి గుండంలో ఏర్పాటు చేసిన తెప్పలో దేవస్థానం అర్చకులైన అన్నవరం పాండురంగచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు అధ్వర్యంలో స్వామికి పూజలు చేసి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్లరంగనాయకస్వామి దివ్య రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అన్నవరం వెంకట రంగచార్యులు, అన్నవరం భూమసాయి వంశీ, కూనపులి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ డీలర్లపై చర్యలు తీసుకోరా..?


టీడీపీ అభ్యర్థితో ప్రచారం చేస్తున్న నాగమణి

దర్శి: పట్టణంలోని రేషన్‌షాపుడీలర్లు చిమ్మా శ్రీను, మేడిశెట్టి నాగమణిలపై ఆర్‌ఓకు ఫిర్యాదు అందాయి. చిమ్మా శ్రీను ఓ యూట్యూబ్ చానల్‌లో టీడీపీకి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారని, నాగమణి టీడీపీ అభ్యర్థి లక్ష్మితో కలిసి ప్రతి రోజు ప్రచారంలో పాల్గొంటుందని ఫిర్యాదులు అందాయి. అందుకు సంబంధించిన ఆధారాలు వారికి అందజేశారు. గతంలో కూడా వీరిపై ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.